## గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు

*ఎస్ఐఆర్–2026పై ప్రజలకు అవగాహన కల్పించనున్న అధికారులు*



**దశ, చిన్నంబావి:** ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో భాగంగా చిన్నంబావి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 27, గురువారం ఉదయం 10 గంటల నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ కె. శ్రీనివాస్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శి, జీపీ సిబ్బంది సమన్వయంతో గ్రామసభ నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామసభకు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ముందస్తుగా సమాచారం అందించి, వారి సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని బీఎల్ఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. గ్రామసభలో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్), నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీస్/అనామలీస్ జాబితాలను ప్రజలకు చదివి వినిపించి, వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తహసీల్దార్ సూచించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే సందేహాలు, అభ్యంతరాలు, సూచనలను సంబంధిత అధికారులు నమోదు చేసి, ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించిన వివరాలను, కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని చిన్నంబావి మండల తహసీల్దార్ కార్యాలయానికి తప్పనిసరిగా తెలియజేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ కె. శ్రీనివాస్ కోరారు.

## నోటీసులతోనే కాలయాపన.. అక్రమ నిర్మాణాలకు అడ్డెక్కడ?

❖ *పెద్ద అంబర్‌పేట, కుంట్లూర్ , మన్సూరాబాద్, హయత్‌నగర్‌లో యథేచ్ఛగా షెడ్లు, గోదాములు..*

❖ *ప్రభుత్వ ఆదాయానికి గండి!*



**దశ, పెద్ద అంబర్ పేట :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారుల నోటీసులకు విలువ లేకుండా పోయిందా? పెద్ద అంబర్‌పేట, గుంటూరు, మన్సూరాబాద్, హయత్‌నగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు, గోదాములు, ఇతర నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ.. నిర్మాణాలు మాత్రం కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు ఆపకుండా నిర్మాణదారులు ముందుకు సాగుతున్నారని చెబుతున్నారు. దీంతో నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారికి అధికారుల చర్యలపై భయం లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు నోటీసులు జారీ చేసి, పై అధికారులకు వివరణలు పంపడం, తదుపరి చర్యల పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ జాప్యం కారణంగా అక్రమ నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగితే ప్రభుత్వానికి రావాల్సిన నిర్మాణ అనుమతి ఫీజులు, జరిమానాల రూపంలో ఆదాయం కోల్పోయే అవకాశం ఉంది. అదే సమయంలో భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం కూడా మరింత క్లిష్టంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షెడ్లు, గోదాములపై కేవలం నోటీసులతో సరిపెట్టకుండా.. అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై తీసుకున్న చర్యల వివరాలను అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు.

## భాగ్యలక్ష్మి కాలనీ లో గంజాయి మత్తులో యువకుల వీరంగం



**దశ, కుత్బుల్లాపూర్:** భాగ్యలక్ష్మి కాలనీ లో గంజాయి మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. సీసీటీవీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు అయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న ర్యాపిడో కార్ డ్రైవర్ని ఆపి గంజాయి కావాలంటూ పది మంది రచ్చ చేసారు. గంజాయి నా వద్ద లేదనడంతో ఆగ్రహానికి గురై మత్తులో డ్రైవర్ ఆకాష్పై బీర్ సీసాలతో విచక్షణారహితంగా దాడి చేసారు. గంజాయి యువకుల దాడిలో కార్ డ్రైవర్ ఆకాష్ తలకు తీవ్ర గాయాలతో పాటు చేయి విరిగింది. దాడి ఘటనలో దెబ్బలు తట్టుకోలేక పక్కనే ఉన్న తన రూమ్కి పరిగెత్తాడు. తరుముకుంటూ వెళ్లి డ్రైవర్ ఇంటి ఆవరణలో కట్టెలతో విచక్షణారహితంగా దాడికి దిగారు.



## డిండి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి

❖ *నల్లగొండ జిల్లాకు అన్యాయం చేస్తే సహించేది లేదు*

❖ *సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి*

**దశ, పెద్ద హైదరాబాద్:** డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలను వెంటనే పునఃపరిశీలించి, డిండి కాల్వకు పూర్తి స్థాయిలో నీరు అందేలా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గట్టుప్పల మండల కేంద్రంలో మునుగోడు నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వీరారెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం నీటిని పాలమూరు-రంగారెడ్డి జిల్లాలకు 1.50 టీఎంసీలు, నల్లగొండ జిల్లాకు 0.50 టీఎంసీలు అందించాలనే లక్ష్యంతో డిండి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారని తెలిపారు. అయితే డిండి కాల్వకు 440 మీటర్ల లెవెల్ నుంచి నీటిని తీసుకునేలా నిర్ణయించడం వల్ల జిల్లాకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు.ఏదుల రిజర్వాయర్ నుంచి వట్టెం రిజర్వాయర్‌కు 437 మీటర్ల లెవెల్ నుంచి నీటిని తరలించే పనులు పూర్తయినప్పటికీ, డిండి కాల్వకు 440 మీటర్ల లెవెల్ నుంచి నీటిని తీసుకోవడం వల్ల 6 వేల క్యూసెక్కులకు బదులుగా కేవలం 1,500 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఓటర్ల సమగ్ర సవరణపై నేడు వార్డు సభలు




**దశ, పెద్ద అంబర్‌పేట:** పెద్ద అంబర్‌పేట, కుంట్లూర్ డివిజన్లలో కొనసాగుతున్న ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ (SIR)లో తొలి దశైన ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, స్వీకరణ పూర్తయింది. ఈ నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఓటర్ల వివరాలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.


ఆగస్టు 27న ఉదయం 8 గంటలకు పెద్ద అంబర్‌పేట, పసుమముల, కుంట్లూర్, తట్టి అన్నారం, తారామతిపేట, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, కల్వంచ, బాచారం వార్డు కార్యాలయాల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు ఏఈఆర్ఓ అధికారులు తెలిపారు. వార్డు సభల్లో సంబంధిత పోలింగ్ స్టేషన్ పరిధిలోని డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రజలకు వెల్లడించనున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు, బూత్ లెవల్ ఏజెంట్లు , రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు సభలకు హాజరై ఓటర్ల వివరాలను పరిశీలించాలని అధికారులు కోరారు.

ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే సభల సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. SIR ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్

❖ *రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తాం*

❖ *మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటన*



**దశ, కొల్లాపూర్ :** కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ అందించేందుకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కొల్లాపూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో నియోజకవర్గంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉచిత శిక్షణ అందించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 రోజుల పాటు పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గానికి చెందిన అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. వచ్చే నెల 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉచిత పోలీస్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో, ఆయన సౌజన్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, ఎక్కువ మంది ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించడమే ఫౌండేషన్ లక్ష్యమని ధర్మతేజ తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

❖ *నిజామాబాద్ యువకుడు మృతి*



**దశ, హైదరాబాద్:** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ నగరంలోని గూపన్‌పల్లికి చెందిన రాహుల్ అనే యువకుడు మృతి చెందారు. తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా, వారిలో నిజామాబాద్‌కు చెందిన రాహుల్ కూడా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడు రాహుల్ తండ్రి బాబూరావు ఈ విషయాన్ని ధృవీకరించారు. చిన్ననాటి నుంచే చదువుల్లో ప్రతిభ కనబరిచిన రాహుల్ ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. ఎంఎస్ పూర్తి చేసిన అనంతరం అక్కడే ఉంటూ పీహెచ్‌డీ చదువుతున్నట్లు ఆయన తండ్రి తెలిపారు. ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తుండగా వాహనం వేగంగా వెళ్లి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని ఫ్లోరిడా అధికారులు మృతుల కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు తెలుస్తోంది. రాహుల్ మృతి వార్త విని ఆయన తల్లిదండ్రులు నాగరాణి, బాబూరావు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రతిరోజూ తమతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకునే కుమారుడు ఇక లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తాం

❖ *తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** విద్యార్థుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కేజీబీవీ చివ్వేంల పాఠశాలకు రూ.30 వేల విలువైన మోటార్‌ను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని అన్నారు. పాఠశాల అవసరాలను తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైన మేరకు సహకారం అందిస్తానని తెలిపారు. త్వరలో పాఠశాలలోని ల్యాబ్‌లకు అవసరమైన మెటీరియల్‌ను కూడా అందిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడితే వారు విద్యలో మరింత రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ పూలన్, కాంగ్రెస్ నాయకులు పిల్లల రమేష్ నాయుడు, గోపాల్ రెడ్డి, అరవింద్ రెడ్డి, యాట ఉపేందర్, తండు శ్రీనివాస్, మర్ల కరుణాకర్ రెడ్డి, ధర్మానాయక్, పాఠశాల స్టాఫ్ జి దుర్గా డి సుజాత, తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేట ప్రజల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే ఉండి ఏం లాభం..?





❖ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో AICC సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాది లు.

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎక్కడ ఉన్నారని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు ప్రశ్నించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 36, 1వ వార్డు లలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూర్యాపేట నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే ఉన్నా లేనట్టేనని విమర్శించారు. సూర్యాపేట పట్టణ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సమస్యకు వెంటనే పూర్తి పరిష్కారం చూపుతామని చెప్పలేమని, ఇది భారీ బడ్జెట్‌తో కూడుకున్న అంశమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ల ఆశీస్సులతో సూర్యాపేట మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే తిరిగి ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఉంటుందని అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండకుండా హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్ నుంచి విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ముందుగా ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు నియోజకవర్గానికి ఏం చేశారో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసే బాధ్యతను తాము తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 36 వ వార్డు కౌన్సిలర్ షేక్ మన్సూర్ బి, 1 వ వార్డు కౌన్సిలర్ బానోతు సైదులు నాయక్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ వీరన్న నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఫారూఖ్, నాగేల్లి అరుణ్, నరేందర్ నాయుడు, చెంచల నిఖిల్, నాగు నాయక్, పడిదల రవి, కస్పరాజు రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ముఠా గుట్టురట్టు



**దశ, హైదరాబాద్:** గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ కోదాడ పట్టణ పరిధిలో గంజాయి ముఠాను పట్టుకున్నారు. బోడిగుట్ట ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 1.100 కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కోదాడ పట్టణ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరితో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. సాలె వేణు, ఉల్లెందుల సుదర్శన్, పోలంపల్లి సాయి సుమంత్, రేళ్ల గోపిలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న బీహార్‌కు చెందిన పంకజ్ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అరెస్టయిన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శివశంకర్ కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా చూడాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. విద్యార్థులు సైతం మత్తు పదార్థాల ప్రభావానికి లోనై నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

## నేత్రదానం మహోన్నతం: డాక్టర్ తుకారాం రాథోడ్




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా అంధకారంలో ఉన్న ఎందరో నిస్సహాయుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు సందర్భంగా కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానం, అవయవదానం, కంటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కంటి చూపు మందగించడం, తరచూ తలనొప్పి రావడం, పుస్తకాలు లేదా మొబైల్ ఫోన్లను అతి సమీపంగా పెట్టుకుని చూడటం, కళ్లలో మంట, దురద, నీరు కారడం, ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పిల్లలు చదువుకునే సమయంలో గదుల్లో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని, మొబైల్, కంప్యూటర్, టీవీ స్క్రీన్లను ఎక్కువసేపు నిరంతరాయంగా చూడకుండా మధ్యమధ్యలో కళ్లకు విశ్రాంతి ఇవ్వాలని స్పష్టం చేశారు. కంటికి సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చినా సొంతంగా చుక్కల మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకే మందులు ఉపయోగించాలని హెచ్చరించారు. బాణసంచా కాల్చేటప్పుడు వెలువడే నిప్పురవ్వలు, విషపూరిత రసాయనాలు కళ్లకు తగిలితే తీవ్రమైన గాయాలవుతాయని, చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలని తెలిపారు. కంట్లో దుమ్ము, రసాయనాలు లేదా చిన్న వస్తువులు పడినప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ కళ్లను రుద్దరాదని, వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, వెల్డింగ్ పనులు చేసేవారు తప్పనిసరిగా రక్షణ కళ్లద్దాలు ధరించాలన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు మా మద్దతు




❖ బీసీ ఉద్యమ నాయకులు వట్టే జానయ్య యాదవ్

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు తమ పూర్తి మద్దతు ఉంటుందని బీసీ ఉద్యమ నాయకులు వట్టే జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించాలనే డిమాండ్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వస్తే జిల్లాలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక, విద్యా రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు చేపడుతున్న ఉద్యమానికి బీసీ సంఘం తరఫున అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు ఉద్యమానికి తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సైతం బుల్లెట్ ట్రైన్ కోసం జరుగుతున్న నిరాహార దీక్షలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని జానయ్య యాదవ్ కోరారు. అయితే సూర్యాపేట ప్రజల ప్రధాన సమస్యగా ఉన్న ఈ అంశంపై ఆయనకు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్ష కోసం జరుగుతున్న ఉద్యమంలో ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పాల్గొని తన చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంభం నాగరాజు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శుభాష్‌నగర్‌లో పోలీసుల కార్డాన్ సెర్చ్

❖ నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

**దశ, భద్రాచలం:** భద్రాచలం పట్టణంలోని శుభాష్‌నగర్ కాలనీలో పోలీసులు బుధవారం తెల్లవారుజామున విస్తృతంగా కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో 262 ఇళ్లను పోలీసులు సోదా చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలనీలోని వాహనాలను కూడా పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడం, పెండింగ్ చలాన్లు ఉండటంతో 82 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. పెండింగ్ చలాన్లను వసూలు చేయడంతో పాటు సరైన నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం డీఎస్పీ అరుణ్‌కుమార్ కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేయడం, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు



❖ సుందిళ్ల బ్యారేజీ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాజీ ఎమ్మెల్యే పుట్టామధూకర్

**దశ, మంథని:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు ఇన్నాళ్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని వివిధ నిపుణుల కమిటీలు, సంస్థల నివేదికలు స్పష్టం చేశాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

మంథని మండలం సిరిపురం గ్రామంలోని సుందిళ్ల బ్యారేజీ వద్ద బుధవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి పుట్ట మధూకర్ పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లుగా చేస్తున్న ఆరోపణలు, విమర్శలకు నిపుణుల నివేదికలు సమాధానం చెప్పాయని పుట్ట మధూకర్ పేర్కొన్నారు.

వాటర్ పవర్ సెంట్రల్ రీసెర్చ్ స్టేషన్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందాల నివేదికలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఒకటిగా కాళేశ్వరాన్ని నిర్మించి తెలంగాణకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత మత్స్య సంపద పెరిగిందని, భూగర్భ జలాలు మెరుగుపడ్డాయని, సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మంథని ప్రాంతంలోనూ అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన అన్నారు. ఒకప్పుడు ఉపాధి కోసం దుబాయ్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన బెస్తపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు, ప్రాజెక్టులో నీటి నిల్వలతో మత్స్య సంపద పెరగడంతో తిరిగి స్వగ్రామానికి వచ్చారని పేర్కొన్నారు.

ప్రస్తుతం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయకపోవడంతో మత్స్యకారులకు ఉపాధి లేక మళ్లీ వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో తండ్రి, కొడుకుల పాలనలో ఒక్క చెక్‌డ్యాం, ఒక్క బ్రిడ్జి కూడా నిర్మించలేదని పుట్ట మధూకర్ విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బొక్కలవాగుపై చెక్‌డ్యాంలు, గోదావరిపై బ్రిడ్జిల నిర్మాణం జరిగిందని గుర్తుచేశారు. సుందిళ్ల బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని నిపుణుల బృందాల నివేదికలు చెబుతున్నప్పటికీ నీటిని నిల్వ చేయకుండా ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.

ఈ విషయంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా మౌనంగా ఉండటం సరికాదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఢిల్లీకి మూటలు మోసుకెళ్లడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పుట్ట మధూకర్ విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలు, అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బ్యారేజీల గేట్లు మూసి నీటిని నిల్వ చేయాలని, లేకపోతే నీటి కోసం ప్రజలే ఉద్యమించాల్సిన పరిస్థితి వస్తుందని పుట్ట మధూకర్ హెచ్చరించారు.

# క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంది

❖ యశోద ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్ వెల్లడి




**దశ, సూర్యాపేట ప్రతినిధి:** క్యాన్సర్ చికిత్సకు ప్రస్తుతం అనేక ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోగికి ఒకే రకమైన చికిత్స విధానం సరిపోదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుభట్లు తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ రకం, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స విధానాన్ని నిర్ణయిస్తామని తెలిపారు. క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం, రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడం, చికిత్స వల్ల కలిగే దుష్ప్రభావాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం ఆధునిక క్యాన్సర్ చికిత్స ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఆధునిక సాంకేతికతతో చికిత్సలో దుష్ప్రభావాలను తగ్గించడంతో పాటు చికిత్స ప్రభావాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో అత్యాధునిక వికిరణ చికిత్స సాంకేతికతతో కూడిన 'హైపర్‌సైట్' యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ విధానంలో క్యాన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని అత్యంత కచ్చితత్వంతో గుర్తించి అక్కడికే చికిత్స అందించడం ద్వారా చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. చికిత్సను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించడం ఈ సాంకేతికత ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రతి నెల రెండో, నాలుగో బుధవారాల్లో సూర్యాపేటలోని కనెక్ట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రోగులకు వైద్య సలహాలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ సుమంత్ కుమార్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రి సికింద్రాబాద్ మేనేజర్ కర్నే సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ బృందం మేనేజర్ ప్రవీణ్ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.